ప్రజాశక్తి

గురువారం 14 డిసెంబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అంగన్‌వాఢీ



అనకాపల్లి జిల్లా యలమంచిలిలో అంగన్‌వాడీల సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతున్న సంఘం నేత నాగశేషు



విశాఖ నగరంలోని మద్దిపాలెం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

రెండో రోజుకు చేరిన సమ్మె

వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు తలపెట్టిన సమ్మె బుధవారానికి రెండో రోజుకు చేరింది. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు నిరసనలు చేపట్టారు. హక్కుల కోసం నినదించారు.

(వార్తలు 8లో..)

శ్రీ కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన బురుజుపేట శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పూజలో ఆలయ ఉపకమిషనరు, కార్యనిర్వాహణాధికారిణి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కె.సింహాచలం, ధర్మకర్తలు బొదిలపాటి సత్య రూపవాణి, ఎం.ధనలత, బి.వెంకట రత్నం, బి.అనురాధ, ఎస్.సతీష్, వి.మారుతీప్రసాద్, ఎన్ఎస్ఎస్. సుబ్రహ్మణ్యం, ఎస్.సురేష్, సిఎంఆర్ గ్రూప్స్ అధినేత మావూరి వెంకటరమణ, కార్యనిర్వాహక ఇంజినీరు సిహెచ్‌వి. వెంకట రమణ, ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, కెఎస్ఎన్.మూర్తి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి త్రికాల పంచామృతాభిషేకం సేవలో 14 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.శిరీష మీడియాతో మాట్లాడుతూ దర్శనం, అన్నదాన వివరాలు వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నేటి నుంచి విశాఖ బాలోత్సవం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ బాలల పండగకు సిద్ధమైంది. నగరంలో మూడు రోజులు పాటు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఈ ఫెస్టివల్ జరుగనుంది. విశాఖ బాలోత్సవం పేరిట తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని ఈ నెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. గ్రీన్ పార్క్ రోడ్డులో ఉన్న సెయింట్ ఆంథోనీ తెలుగు మీడియం స్కూల్‌లో ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. గురువారం ఉదయం 10 గంటలకు ఈ ఉత్సవాలను విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ప్రారంభించనున్నారు. రెవరెండ్ ఫాదర్ ఆర్‌సిఎం స్కూల్స్ ఇన్‌ఛార్జి రత్నకుమార్, రోటరీ క్లబ్ విశాఖపట్నం జిల్లా ప్రెసిడెంట్ డిఎం.రావు తదితర ప్రముఖులు పాల్గొంటారు. బాలోత్సవం పూర్తి వివరాలకు 9490098794 నెంబరును సంప్రదించాలని విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

తుపాను బాధిత రైతుల గోడు పట్టదా ?

వార్త 2లో..

తోపుడు బండి తొలగింపుపై నిరసన

వార్త 2లో..

985వ రోజుకు 'ఉక్కు' జెఎసి దీక్షలు

వార్త 2లో..

జనాన్ని తప్పుదోవ పట్టిస్తున్న జనసేన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తున్న తమ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు గుప్పించి జనాన్ని జనసేన పార్టీ నాయకులు నాదెండ్ల మనోహర్ తప్పుదోవ పట్టిస్తున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బుధవారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూపూర్‌లో పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా భూములు కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వక్రీకరించి నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలుపై ఆయన తీవ్రంగా స్పందించారు. హిందూపూర్‌లో 350 ఎకరాల భూమిని క్విడ్ ప్రోకో కింద నియోజన్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కట్టబెట్టినట్టు మనోహర్ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇటీవల రాష్ట్రంలోని 11 నియోజకవర్గాలకు చెందిన వైసిపి ఇన్‌చార్జిలను మార్చిన అంశంపై విలేకరులు



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

అడిగిన ప్రశ్నకు అమర్‌నాథ్ సమాధానం చెబుతూ జగన్ మోహన్ రెడ్డి అన్ని విషయాలూ పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. విశాఖపట్నం రైల్వే జోన్‌కు రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించడం లేదని కేంద్ర మంత్రి చేసిన ప్రకటనలో నిజం లేదని, జోన్ ఏర్పాటు చేస్తామంటే 48 గంటల్లో భూమిని కేటాయిస్తామని మంత్రి అమర్‌నాథ్ స్పష్టం చేశారు.

మూడో రోజూ అదే జోరు

- పాయకరావుపేట నియోజకవర్గంలో పూర్తయిన లోకేష్ యాత్ర
- యలమంచిలిలో ప్రవేశం
- టిడిపి, జనసేన పోటాపోటీగా ఫ్లెక్సీలు
- ఎక్కడికక్కడ నాయకులు బల ప్రదర్శన



యలమంచిలి వైపు ఉత్సాహంగా సాగుతున్న లోకేష్ పాదయాత్ర

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, ఎస్.రాయవరం, యలమంచిలి రూరల్ విలేకరులు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర పాయకరావుపేట నియోజకవర్గంలో పూర్తి చేసుకొని యలమంచిలి నియోజకవర్గంలోకి బుధవారం సాయంత్రం ప్రవేశించింది. సోమవారం రాత్రి పాయకరావుపేట నియోజవర్గంలోకి ప్రవేశించిన ఈ యాత్ర మంగళవారం నక్కపల్లి, బుధవారం మధ్యాహ్నం వరకూ ఎస్.రాయవరం మండలంలో సాగింది. ఆయన బస చేసిన కృషి గోకులం నుంచి ప్రారంభించిన యాత్ర ఎస్.రాయవరం మండలంలోని కోనవాని పాలెం, తిమ్మాపురం అడ్డురోడ్, గోకులపాడు, పెనుగొల్లు జాతీయ రహదారి గుండా సాగింది. మూడో రోజూ అదే జోరు కనిపించింది. దారిలో కార్యకర్తలు, మహిళలు స్వాగతం మధ్య పాదయాత్ర జరిగింది. సామాజిక తరగతులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించి ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. బుధవారం 18.3 కిలోమీటర్లు ఆయన నడిచారు. మొత్తంగా యువగళం పాదయాత్ర 3059.6 కిలోమీటర్లకు చేరింది.

ఎక్కడ చూసినా ఫ్లెక్సీలు, డిజిటల్ తెరలు

యలమంచిలి నియోజకవర్గం పులపర్తి, లక్కవరం, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మూడో రోజూ అదే జోరు



లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న అయ్యన్న

ములకలాపల్లి, పురుషోత్తమపురం, పోతిరెడ్డిపాలెం మీదుగా రేగుపాలెం వరకు లోకేష్ యాత్ర సాగింది. కొత్తూరు ఎస్‌వి కన్వెన్షన్ సెంటర్ వద్ద బస చేశారు. జాతీయ రహదారి నుంచి యలమంచిలి వచ్చే రహదారిలో ఇరువైపులా పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. యలమంచిలి నియోజకవర్గ ప్రవేశం నుంచి దారిపొడవునా టిడిపి, జనసేన నాయకులు పోటాపోటీగా వీటిని పెట్టారు. టిడిపి యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయకుమార్ భారీగా యవగళం ఫ్లెక్సీలు పెట్టారు. బైరా ఫౌండేషన్ చైర్మన్ బైరా దిలీప్ చక్రవర్తి ఫ్లెక్సీలు కూడా అత్యధికం ఉన్నాయి. అయ్యన్నపాత్రుడు తనయుడు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఫ్లెక్సీలు కూడా పలుచోట్ల కనిపించాయి. యలమంచిలి రహదారి వద్ద డిజిటల్ తెరలు, భారీ స్క్రీన్‌లు ఏర్పాటుచేశారు.

యలమంచిలిలో ఘన స్వాగతం

యలమంచిలి నియోజకవర్గంలోకి ప్రవేశించిన లోకేష్‌కు టిడిపి యలమంచిలి ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన ఇన్‌ఛార్జి సుందరపు విజయ్‌కుమార్ అపూర్వ స్వాగతం పలికారు. భారీ గజమాలలు, డప్పులు, కోలాటం, బాణాసంచా మోతలతో ఆయనను స్వాగతించారు.

స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని వినతి

యలమంచిలి మండలంలోని మై హోమ్ సిమెంట్ కంపెనీ, సెజ్ పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో వలస వెళ్తున్నామని ములకలపల్లిలో నిరుద్యోగులు లోకేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్దఎత్తున పరిశ్రమలు తెచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. యువతకు ఉద్యోగాలు వచ్చేవరకూ యువగళం నిధి కింద నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు.

పోలీసులకు భవిష్యత్తు గ్యారెంటీ కార్డులు పంచిన లోకేష్

జగన్ తెచ్చిన జిఒ 79 రద్దు చేసి అలవెన్స్‌ను యథాతథంగా ఇస్తామని పోలీసులకు భవిష్యత్ గ్యారెంటీ కార్డులను లోకేష్ అందజేశారు. జగన్ పాలనలో పోలీసులకు సర్కారు పెట్టిన బకాయిలన్నీ చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

లోకేష్‌ను కలిసిన నర్సీపట్నం న్యాయవాదులు

పురుషోత్తమపురంలో నర్సీపట్నం బార్ అసోసియేషన్ ప్రతినిధులు లోకేష్‌ను కలిశారు. పేద, బలహీనవర్గాల ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ప్రభుత్వం అమలులోకి తెచ్చిందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమైనదని లోకేష్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

విజెఎఫ్ ఎన్నికలు నిలిపివేయాలని ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కొంతమంది అర్హత లేని జర్నలిస్టులతో జరుగుతున్న వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ఎన్నికల ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలంటూ విశాఖ అక్రిడియేట్ జర్నలిస్టులు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. విజెఎఫ్‌లో జరిగిన అవకతవకలను నిగ్గు తేల్చాలని, గతంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు పరిశీలనకై ఏర్పాటైన కమిటీల నివేదికలను బహిర్గతం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఓటరు జాబితా విడుదలైన రోజునే హడావుడిగా జారీ చేసిన విజెఎఫ్ ఎన్నికల నోటిఫికేషన్‌ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

985వ రోజుకు 'ఉక్కు' జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు బుధవారం నాటికి 985వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు మల్కాపురం జోన్ నాయకులు ఎస్.లోకేష్, డి.కిషోర్, జమ్ము ఈశ్వరరావు, బి.వెంకటేష్, సిహెచ్.అప్పారావు, గండి అప్పారావు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే ఓట్ల తొలగింపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఓటమి భయంతోనే ఓటర్ల జాబితా నుంచి ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి ఉత్తరాంధ్రపై నిజంగా ప్రేమ ఉంటే విశాఖ నుంచి తనపై పోటీ చేసి గెలవాలని సవాలు విసిరారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టిడిపి కూటమి విజయం సాధిస్తుందన్నారు. సమావేశంలో టిడిపి మహిళా నాయకురాలు కేదార లక్ష్మి, డాక్టర్ పపూర్ నికుంజ్, జనసేన నాయకులు జి.జగదీష్ పాల్గొన్నారు.

తుపాను బాధిత రైతుల గోడు పట్టదా ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తుపానుకు భారీగా నష్టపోయిన రైతులను పట్టించుకోకుండా బిసి, ఎస్‌సి సామాజిక యాత్ర అంటూ వైసిపి మంత్రులు బస్సు యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందని టిడిపి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి బుద్ధా వెంకన్న విమర్శించారు. బుధవారం పార్టీ విశాఖ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సామాజిక బస్సు యాత్ర పేరుతో ప్రయాణిస్తున్న వారు మనుషులా ? దున్నపోతులా ? అని ప్రశ్నించారు. మీరు మంత్రులైతే తుపాను వల్ల నష్టపోయిన రైతుల గోడు వినండి అన్నారు. నష్టపరిహారం ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టకుండా, బస్సు యాత్ర పేరుతో గ్రామాల్లోకి వెళ్లి దండుపాలెం గ్యాంగ్‌లా మారారని ఎద్దేవా చేశారు. వాలంటీర్లను పంపించి, బాధిత రైతులను బెదిరించి మీటింగ్‌లకు రావాలని ఒత్తిడి చేయడం దారుణమన్నారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌లో మొద్దు నిద్రపోతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణా రెడ్డి, విజయసాయిరెడ్డి వంటి వారే బాగుపడ్డారని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి పులివెందులలో కూడా ఓడిపోతారని, అందుకు ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే సూచిక అని అన్నారు.

బిల్లులు చెల్లించాలి



సమావేశంలో పాల్గొన్న జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. జివిఎంసి సాధారణ పద్దులో బిల్లుల చెల్లింపులు జనరల్ ఓచర్ ప్రయారిటీ ప్రకారమే జరపాలని, గ్రాంటులపై చేసిన పనులకు వెంటనే చెల్లింపులు జరిగేటట్లు చూడాలని, గ్రాంటు ఇఎండి, ఎఫ్ఎస్‌డి, ఎఎస్‌డిలు లయబిలిటీ పిరియడ్ దాటి మూడు సంవత్సరాలైనా చెల్లింపులు జరగనందున వెంటనే చర్యలు తీసుకోవాలని సమావేశం కోరింది. మేయర్, కమిషనర్ సమక్షంలో సంబంధిత అధికారులతో సమస్యలు పరిష్కారం అయ్యేలా జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. సమవేశంలో చైర్మన్ రొంగళి జగన్నాధం, అధ్యక్షులు గొంప చంద్రమౌళి, కన్వీనర్ రాజాన వెంకటరావు, కార్యదర్శి రంధి సాధురావు, ఉపాధ్యక్షులు పియస్.ప్రసాద్, పిఎ.రాజు, బి.రామానాయుడు, జి.దేముడు, సలహాదారులు పైలా కృష్ణారావు, వీరభద్రరావు, బి.సత్యనారాయణ, ఆర్‌యన్.నాయుడు, నాగరాజు, పూర్ణచంద్రరావు, కోశాధికారి నరసింగరావు, ఆడిటర్ యస్.రవీంద్ర,తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండి తొలగింపుపై నిరసన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వెంకోజీపాలెం మెడికవర్ హాస్పిటల్ వద్ద తోపుడు బండి (టీ బడ్డీ)ని తొలగించడంపై సిఐటియు మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒంటరి మహిళ మారేడుపూడి మేరి అక్కడ తోపుడు బండిపై ఆధారపడి జీవిస్తోందన్నారు. ఈ నెల 11న జివిఎంసి సిబ్బంది లేకుండా తోపుడు బండిని ఆసుపత్రి సెక్యూరిటీ సూపర్‌వైజర్, మరికొందరు సెక్యూరిటీ సిబ్బంది తొలగించి దూరంగా రోడ్డుపైన పెట్టేశారన్నారు.

హాస్పిటల్ మేనేజ్‌మెంట్, శ్రీకాంత్ అపార్టుమెంట్ కమిటీ వారు ఆ మహిళపై దాడి చేశారన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.వెంకటరావు, కె.కుమారి, తోపుడుబండ్ల కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.సింహాచలం, శివ, రాజేంద్రప్రసాద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు ఓటమి భయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపిలో 11 మంది ఇన్‌ఛార్జిలను మార్చడం జగన్ మోహన్ రెడ్డికి మొదలైన భయానికి నిదర్శనమని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

చీరలు, యూనిఫారాలు పంపిణీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : క్రిస్మస్, సంక్రాంతి పండగల సందర్భంగా 35వ వార్డు దుర్గాలమ్మ గుడి ప్రాంతంలో 350 మంది వృద్ధులకు చీరలు, ఆటో డ్రైవర్లకు యూనిఫారాలను జనసేన నియోజకవర్గ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు బుధవారం పంపిణీ చేశారు. పవన్ రావాలి.. పాలన మారాలి నినాదంతో దక్షిణ నియోజకవర్గంలో చేపట్టిన పవనన్న ప్రజాబాట కార్యక్రమానికి వస్తున్న ప్రజాదరణ బాగుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘు, త్రినాథ్, బొగ్గు శ్యామ్, గాజుల శ్రీను, సతీష్, తెలుగుశక్తి అధ్యక్షులు బివి.రామ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్గానిక్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో గురువారం నుంచి గో ఆధారిత ప్రకృతి పంటల మేళా జరుగనుంది. ఈ విషయమై భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయకులు జలగం కుమార్ స్వామి ఎయు గ్రౌండ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి రైతుసంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్య వర్మ, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్ కుమార్, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల కేన్సర్ పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే చికిత్సకు మెరుగైన అవకాశాలున్నాయని హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్, కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజీ డాక్టర్ శ్రీకాంత్ దిక్కల తెలిపారు. బుధవారం నగరంలోని ప్రముఖ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో క్యాన్సర్ కేసుల సంఖ్య పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ కార్మికుల సమ్మె ఉధృతం

భీమిలి ప్రాజెక్ట్ పరిధిలో మూతపడ్డ 278 కేంద్రాలు
నిరవధిక సమ్మెలోకి వెళ్లిన 508 మంది వర్కర్లు, హెల్పర్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న భీమిలి, ఆనందపురం, పద్మనాభం, జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో ఉన్న 508 మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు మంగళవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. మంగళవారం ప్రారంభమైన సమ్మె బుధవారం నాటికి మరింత ఉధృతమైంది. దీంతో ఆయా మండలాలు, జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని 250 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, 28 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఇప్పటికే మూతపడ్డాయి.

ఎదుగూ బొదుగూ లేదు

అంగన్వాడీ వర్కర్‌గా దాదాపు 21ఏళ్లగా పనిచేస్తున్నాను.నేను రూ.1000 జీతానికి ఉద్యోగంలో చేరాను. ఎన్నో పోరాటాల ఫలితంగా నేడు రూ.11,500కు చేరింది. ప్రస్తుత నిత్యావసరాల ధరలు చూస్తే వచ్చే జీతం ఏ మూలకూ సరిపోవడంలేదు.



కె.శ్రీగౌరి
అంగన్‌వాడీ వర్కర్
సంతపేట, తగరపువలస

ఎంతో ప్రయాస పడుతున్నాం

దాదాపు 25 ఏళ్లగా హెల్పర్‌గా పనిచేస్తున్నాను. రూ.250 జీతానికి జాయిన్ అయ్యాను. ఇప్పుడు రూ.7000 ఇస్తున్నారు. ఉదయం 8.30 గంటలకు వెళ్లి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రంలో ఉంటాను.



ఊడికల రాజేశ్వరి,
హెల్పర్,
సంతపేట, తగరపువలస

యాప్‌లతో అవస్థలు..

టిహెచ్‌ఆర్, చిన్న పిల్లల ఎదుగుదల, ఎత్తు, బరువు, గర్భిణిలకు ఫొటోలు తీయడం, ఇప్పడేమో గుడ్లు, పాలుకు ఫొటోలు తీయడం ఇలా అనేక యాప్‌లతో అవస్థలు పడుతున్నాం. ఇచ్చే జీతం తక్కువ. శ్రమ ఎక్కువ.



బి.వరలక్ష్మి
అంగన్‌వాడీ వర్కర్
పిట్టావానిగుట్ట
తగరపువలస

పని భారం ఎక్కువ..

పని భారం చాలా ఎక్కువ. వచ్చే వేతనం తక్కువ. ధరలు ఆకాశానికి తాకుతున్నాయి. ఎలా బతికేది.



కె.రామలక్ష్మి, హెల్పర్
పిట్టావానిగుట్ట, తగరపువలస

నేరాలు ఘోరాలు

యువకునిపై కత్తితో దాడి

ప్రజాశక్తి - ఆరిలోవ : పాత కక్షల నేపథ్యంలో ఇద్దరు యువకులు మధ్య జరిగిన వాగ్వివాదంలో ఓ యువకునిపై మరొకరు కత్తితో దాడిచేసిన ఘటన బుధవారం ఆరిలోవ సూర్యతేజనగర్‌లో కొత్తగా నిర్మిస్తున్న వంతెన వద్ద చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... కిట్టు గ్యాంగ్‌లోని యువకుడు రవికి అదే గ్యాంగ్‌లో గతంలో ఉన్న మోహన్‌కు బుధవారం ఉదయం వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో మోహన్‌పై రవి చేయి చేసుకున్నాడు. దీంతో మోహన్ తన వద్ద ఉన్న పదునైన ఆయుధంతో రవిపై దాడి చేశాడు. రవికి పొట్టలో గాయమైంది. గాయాలైన రవిని చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం : ముత్తంశెట్టి

ప్రజాశక్తి -మధురవాడ : సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. జివిఎంసి 7వ వార్డు పరిధి స్వతంత్రనగర్‌లో 'ఏపికి జగనే ఎందుకు కావాలి?' కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించి, జెండాను ఎగురవేశారు. అనంతరం రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించి, బుక్‌లెట్‌ను మహిళలకు అందించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్ బాల్ పోటీలకు రేవిడి విద్యార్థిని

ప్రజాశక్తి -పద్మనాభం : న్యూఢిల్లీలో ఈ నెల 16వ తేదీ నుంచి జరగనున్న జాతీయ పాఠశాలల హ్యాండ్ బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు పద్మనాభం మండలంలోని రేవిడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి కె.దివ్య ఎంపికైందని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్.రవికుమార్, ఆర్.శంకరరావు తెలిపారు. నవంబర్ నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనపరచి జాతీయ పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు వి.శంకరరావు తెలిపారు. దివ్య తల్లిదండ్రులు కర్రి రామస్వామి, రామలక్ష్మి వ్యవసాయం చేసుకుంటూ వెంకటపురంలో నివసిస్తున్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన దివ్యను వైస్ ఎంపిపి కోరాడ లక్ష్మణరావు అభినందించి రూ.5000, మరగడ అప్పారావు రూ.2000 ఇచ్చి ప్రోత్సహించారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

ప్రజాశక్తి-సీతమ్మధార : తాటిచెట్లపాలెం రోడ్డు సమీపంలోని చిట్టిబాబు కాలనీ కమిటీ హాల్‌లో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని సిపిఎం ఎస్ఆర్‌నగర్ సంఘం అధ్యక్షులు గౌరీష్, కార్యదర్శి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరీష్ మాట్లాడుతూ, పేదలకు వైద్యం అందుబాటులో లేదని అన్నారు. శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించామని తెలిపారు. రోగులకు తనిఖీల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జోన్ నాయకులు కోటి, రమణ, ప్రసాద్, శంకర్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ ఎ.రాజు, ఎస్ఆర్ నగర్ పరిసర కాలనీల ప్రజలు పాల్గొన్నారు.



శిబిరానికి హాజరైన రోగులు

వైభవంగా రాపత్తు ఉత్సవాలు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం దేవస్థానంలో బుధవారం రాపత్తు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. వేకువజామునే ఆరాధన కార్యక్రమాల అనంతరం ప్రత్యేక పల్లకిలో బేడ మండపం చుట్టూ తిరువీధిని నిర్వహించారు. అధ్యయనోత్సవాలను కూడా వైదికులు వైభవంగా నిర్వహించారు.

ఘనంగా పోలి పాడ్యమి

ప్రజాశక్తి-సింహాచలం: కార్తీకమాసం ఆఖరి రోజున పోలి పాడ్యమిని బుధవారం ఘనంగా నిర్వహించారు. బుధవారం వేకువ జామునే భక్తులు వరాహ పుష్కరిణికి చేరుకొని 365 ఒత్తులు వెలిగించి అరటి దెబ్బల్లో ఉంచి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరిణిలో వదిలిపెట్టారు. వేలాదిమంది భక్తులు జిల్లా నలుమూలల నుంచి పుష్కరిణికి చేరుకొని పూజలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు భద్రత ఏర్పాటుచేశారు. పుష్కరిణి చెరువులోకి ఎవరూ వెళ్ళకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి గజ ఈతగాలను అందుబాటులో ఉంచారు. పుష్కరిణి కాలుష్యం కాకుండా దేవస్థానం సిబ్బంది ఎప్పటికప్పుడు వెలిగించిన దీపాలు ఆరిపోయిన వెంటనే తొలగించారు. ఈ సందర్భంగా వరాహ పుష్కరిని ప్రాంతాన్ని దీపాలతో అలంకరించారు.

సమస్యలపై లోకేష్‌కు వినతి

ప్రజాశక్తి -ఆనందపురం: యువగళం పాదయాత్రలో ఉన్న తెలుగుదేశం నాయకులు నారా లోకేష్‌కు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించినట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, గండిగుండం గ్రామస్తుడు జోగా ముత్యాలరావు చెప్పారు. యువగళం పాదయాత్ర అనకాపల్లి చేరుకున్న సందర్భంగా నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించినట్లు తెలిపారు.

అనంతుని హుండీ లెక్కింపు

ప్రజాశక్తి -పద్మనాభం : అనంతపద్మనాభ స్వామి ఆలయ హుండీని బుధవారం కుంతీ మాధవ స్వామి ఆలయంలో వసంత్ కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. పర్మినెంట్‌గా ఉన్న 5 హుండీలతో పాటు దీపోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన 8 హుండీల ద్వారా నెల రోజుల్లో వచ్చిన ఆదాయాన్ని దేవాదాయ శాఖ సిబ్బంది లెక్కించారు. రూ.2,39,412 వచ్చినట్లు ఆయన అధికారులు తెలిపారు.

పౌరాణిక బృందానికి సన్మానం



కళాకారులను సన్మానిస్తున్న నాగవంశం కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పద్మనాభం గ్రామంలో అనంతపద్మనాభ స్వామి దీపోత్సవంలో భాగంగా 20 మంది పౌరాణిక కళాకారులకు, మరో పదిమంది పౌరాణిక ప్రోత్సాహక గురువులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సన్మానం చేశారు. శ్రీ రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, సత్య హరిచంద్ర నాటకాలను మంగళవారం రాత్రి ప్రదర్శించారు. పౌరాణిక పాత్రలు పోషించిన కళాకారులను ఎమ్మెల్యే సన్మానించారు. అనంతపద్మనాభ నాట్యమండలి ఆర్గనైజర్ నరసింహనాయుడు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ అవార్డు గ్రహీత రెడ్డి తిరుపతినాయుడు, యువ నట కిషోర్ నరసింహనాయుడు, నంది అవార్డు గ్రహీత కేవీ.పద్మావతి, నట గాయకుడు కందుల గుణేశ్వరరావు, నంది అవార్డు గ్రహీత వంకాయల మారుతీప్రసాద్, గాయకుడు బి.సింహాచలం, మాస్టర్ చిరంజీవి, డి.మురళీధర్, సీనియర్ హార్మోనిస్ట్ కంది త్రినాధరావు, సూకరాజు, వల్లూరి పైడిరాజు, కె.రాము, మురళీధర్ పలు పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మన సంస్కృతిని మరవకుండా ఉండేందుకు ఇటువంటి పౌరాణిక నాటకాలను కాపాడుకోవాలన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం గాయత్రీ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ కన్జూమర్ రైట్స్ కౌన్సిల్ విశాఖపట్నం ఆధ్వర్యాన వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిల్ జిల్లా ప్రతినిధి ప్రసాద్‌రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వినియోదారుడు హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలన్నారు. ఏదైనా వస్తువు కొనేటప్పుడు నగదు బిల్లు తప్పక తీసుకోవాలన్నారు. న్యాయవాది అప్పలరాజు మాట్లాడుతూ, నాణ్యతలో, సేవల్లో హాని కలిగితే కన్జూమర్ కౌన్సిల్‌లో కేసు వెయవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రామకృష్ణ, దుర్గాప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డి.అప్పలరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువగళం సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -భీమునిపట్నం : విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, పోలిపల్లి గ్రామంలో జరుగనున్న యువగళం బహిరంగ సభను జయప్రదం చేయాలని టిడిపి విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ నాయకులు ఎం.శ్రీభరత్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తలపెట్టిన యువ గళం పాదయాత్ర ముగింపు సభ పోలిపల్లిలో భారీ ఎత్తున జరుగుతుందన్నారు. పార్టీ మండల అధ్యక్షులు డిఎవి.రాజు, నగర కార్యదర్శి పిట్టా సురేష్, నాయకులు వై.అనీల్‌ప్రసాద్, బోర బంగారురెడ్డి, పాసినరసింగరావు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు పరిధిలో తాగునీటి సరఫరా పైపులైన్లు తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో కొత్తగా రూ.1.40 కోట్లతో చేపట్టనున్న పైపులైన్ నిర్మాణ పనులకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అక్కరమాని పద్మ, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, మాజీ కౌన్సిలర్లు కొప్పల రమేష్, జివి.రమణ, ఎపి పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణరావు, వైసిపి నాయకులు కొప్పల కృష్ణ, పలువురు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



టాస్ వేస్తున్న క్రికెట్ క్రీడాకారుడు అంబటి రాయుడు

కెకెఆర్ లెవెన్స్ విజయం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఆళ్ల శివ గణేష్ ఆధ్వర్యాన డిఎల్‌బి గ్రౌండ్స్‌లో క్రికెట్ పోటీలు జరిగాయి. అమర్ లెవెన్స్ - కెకెఆర్ లెవెన్స్ జట్ల మధ్య పోటీ టి-10 మ్యాచ్ జరిగింది. కెకెఆర్ లెవెన్స్ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా వైవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఇప్పటివరకు గుర్తింపు లేని క్రీడాకారులను, గ్రామీణ స్థాయిలో గల ప్రతిభను వెలికి తీసి వారిని అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్, ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సమన్వయకర్తలు కెకె.రాజు, ఆడారి ఆనంద్‌కుమార్, జిల్లా పార్టీ అధ్యక్షులు కోలా గురువులు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47, 48 వార్డుల పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు చెప్పారు. 47, 48వ వార్డుల పరిధిలోని కప్పరాడ, రాంజీఎస్టేట్, శ్రీనివాసనగర్ కొండవాలు ప్రాంతాలలో కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, 48వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి నీలి రవితో కలిసి పర్యటించారు. కొండవాలు ప్రాంతాలలో రక్షణ గోడలు, మెట్లుమార్గాలు, డ్రెయినేజీ, వీధి దీపాలు, కుళాయిలు, సామాజిక భవనాలను పరిశీలించారు. ప్రజలను సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, గురువొజి, కర్రి రామారెడ్డి, రాజాన గసంగరాజు, సత్యనారాయణరెడ్డి, సుకుమార్, సురేష్, రాఘువులు, సుధాకర్, అప్పారావు, ఎ.సురేష్, రమేష్, రవి, నరేష్, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా శైలేష్



ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా అంబటి శైలేష్ నియమితులయ్యారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డికి, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజుకు అంబటి శైలేష్ కృతజ్ఞతలు తెలిపారు.

వైసిపి రాష్ట్ర మహిళా అధ్యక్షులుగా వరుదు కల్యాణి



ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి రాష్ట్ర మహిళా అధ్యక్షులుగా ఎమ్మెల్సీ వరుదు కల్యాణి నియమితులయ్యారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డికి, జిల్లా నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గాజువాకలో 'సౌత్ షాపింగ్ మాల్' ప్రారంభం

సినీ నటి సురభి సందడి

ప్రజాశక్తి -గాజువాక: కొత్త గాజువాకలో 'సౌత్ షాపింగ్ మాల్'ను సినీ నటి సురభి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సురభి మాట్లాడుతూ, నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందజేస్తూ వినియోగదారుల ఆదరాభిమానాలు చూరగొనాలని సూచించారు. ఈ షాపింగ్ మాల్ మరెన్నో బ్రాంచ్‌లతో ముందుకు సాగాలని అభిలషించారు. విశాఖపట్నం అంటే తనకెంతో ఇష్టమని, ఈ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి రావడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. రాబోయే పండగ సీజన్‌లో వినియోగదారుల మనస్సును దోచే విస్తృత కలెక్షన్లతో ముందుకు రావాలన్నారు.

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ అత్యంత సరసమైన ధరలకు వస్త్రాలను అందించి వినియోగదారుల అభిమానాన్ని చూరగొనాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు మహమ్మద్ ఇమ్రాన్, పల్లా శ్రీనివాసరావు, నరసింహ పాత్రుడు, వురుకూటి చందు, ఎజె.స్టాలిన్, స్టేట్ మైనారిటీ సెక్రటరీ ఎస్ఎండి.గౌష్, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ, క్లాత్, మర్చంట్ అసోసియేషన్ మెంబర్ ఆర్.సుబ్బారావు, బలిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి సురభి

ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంపు

ప్రజాశక్తి -ములగాడ : నెవల్ డాక్‌యార్డు సమీపంలోని సరత్ ఛటార్జీ, బోత్రా గొడన్స్ కార్మికులకు కూలి రేట్లు పెరిగినట్లు సరత్ ఛటర్జీ, బోత్రా గోడౌన్స్ సైడింగ్ వర్క్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.జగ్గునాయుడు తెలిపారు. ముఠా కార్మికుల కూలి రేట్లు పెంపు కోసం గొడౌన్స్ యాజమాన్యం, సిఐటియు మధ్య బుధవారం చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, రెండేళ్లకోసారి కార్మికులకు, యాజమాన్యానికి అగ్రిమెంట్ చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ మేరకు చర్చలు జరిపి అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలిపారు. కార్మికుల తరుపున యాజమాన్యానికి జగ్గునాయుడు అభినందనలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు వల్ల పెట్రోల్, డీజిల్ వంట గ్యాస్ నిత్యావసరధరలు పెరగడంతో కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విశాఖ పోర్టు ప్రైవేటు పరం కావడంతో వేసల్స్ రాక గొడౌన్స్ కార్మికులకు పని సరిగా లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ అగ్రిమెంట్ ద్వారా పట్టుబడికి 13 శాతం, లోడింగ్‌కు 11.5శాతం అన్నింటి పైనా కూలిరేట్లు పెంచడానికి గొడౌన్స్ యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. ఈ చర్చల్లో గొడౌన్స్ యాజమాన్యం తరుపున ఎస్.ఆలీఖాన్, బి.రవీంధ్ర, కాంట్రాక్టర్ శ్రీనివాసరావు, రవికుమార్, సిఐటియు తరుపున ఎం.జగ్గునాయుడు, పి.పైడిరాజు, కె.మహేష్, ఎ.తమ్మయ్య, వై.రాజుబాబు, మేస్త్రీలు రమణబాబు, వి.ముత్యాలు, ఎల్.రామారావు, జి.సూర్యనారాయణ, డి.శ్రీరామ్మూర్తి సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

అందుబాటులో మహీంద్రా జనరేటర్లు



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న సుమిత్ గుప్తా

ప్రజాశక్తి-మాధవధార : మహీంద్రా జనరేటర్లు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని మహీంద్రా పవరోల్ నేషనల్ సేల్స్ హెడ్ సుమిత్ గుప్తా వెల్లడించారు. నగరంలోని మురళీనగర్‌లో ఏర్పాటుచేసిన ఎనర్జియ పవర్ సొల్యూషన్స్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో మహీంద్రా సంస్థకు పటిష్టమైన డీలర్ నెట్‌వర్క్ ఉందన్నారు. విశాఖలో తమ సంస్థకు సేల్స్, సర్వీస్ నిమిత్తం ఇద్దరు డీలర్లను నియమించామని తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. 625 కెవి సామర్థ్యం గల జనరేటర్లు విక్రయిస్తున్నామని చెప్పారు. డీలర్ ప్రతినిధులు టి.వెంకటరమణ, ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఐదు కెవి నుంచి 625, ఇంకా 750 కెవి సామర్థ్యం గల జనరేటర్లను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా సౌత్ రీజనల్ హెడ్ శ్రీకాంత్, కిరణ్, సర్వీస్ టీమ్ ప్రతినిధి గిరిధర్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా బైక్ ర్యాలీ

ప్రజాశక్తి -గోపాలపట్నం, కరాస : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యాన ఎన్ఎడి కొత్త రోడ్డు జంక్షన్‌లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు అంబటి రాయుడు జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతిభగల క్రీడాకారులను గుర్తించి తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి రూపకల్పన చేశారని చెప్పారు. అనంతరం ఎన్ఎడి కొత్త రోడ్డు జంక్షన్ నుంచి పోర్టు స్టేడియం అక్కయ్యపాలెం వరకు 500 బైకులతో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి డిప్యూటీ మేయర్ శ్రీధర్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, మాజీ ఎమ్మెల్యే రెహమాన్, జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న అంబటి రాయుడు

కరాస: విశాఖ పశ్చిమ క్రికెట్ లీగ్‌కు సంబంధించి బైక్ ర్యాలీని ఎన్ఎడి కొత్తరోడ్డు వద్ద నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆనంద్‌కుమార్‌తో కలిసి ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఉన్న యువకుల కోరిక మేరకు విశాఖ వెస్ట్ క్రికెట్ లీగ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కెకె.రాజు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గాజువాక: జివిఎంసి 65వ వార్డు పరిధి బాపూజీ కాలనీలో రూ.1.30 కోట్లుతో అభివృద్ధి పనులకు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడుతో కలిసి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ, ప్రతి వార్డునూ ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. వార్డులో ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని చెప్పారు. కల్వర్టులు, రోడ్లు, కాలువల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగిశెట్టి శ్రీనివాస్, మంగునాయుడు, ఎల్‌వి.రమణ, గొల్లపల్లి రాంబాబు, సన్యాసినాయుడు, చంటిరాజు, రామకృష్ణ, శ్రీనివాస్, పుష్ప, మంత్రి మంజుల, రూప, నారాయణమూర్తి, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో వికసిత్ భారత్

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి కొత్తపాలెంలో వికసిత్ భారత్‌ను జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను స్క్రీన్‌పై ప్రదర్శిస్తూ సమగ్ర వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాల రాజేశ్వరరావు, నాదెళ్ల జ్యోతి, గొర్లే అప్పలరాజు, వలిరెడ్డి శ్రీను, పల్లి శ్రీనివాస్‌నాయుడు, కిలపర్తి సత్యనారాయణ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

19న యోగా విలేజ్‌లో ఆక్యుపంచర్ శిబిరం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఈ నెల 19వ తేదీన ఉచిత ఆక్యుపంచర్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు తెలిపారు. నిపుణులైన వైద్య బృందం వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి ఆక్యుపంచర్ విధానంలో చికిత్సను అందిస్తారని తెలిపారు. డయాబెటిస్, బిపి, సయాటికా, వేరికోస్ వెయిన్స్, ఆస్తమా, సైనస్, మలబద్ధకం, వెన్ను సంబంధ సమస్యలకు ఈ శిబిరంలో ఉచిత చికిత్సను అందిస్తారని పేర్కొన్నారు. విశాఖ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలుష్య తీవ్రతపై క్షేత్రస్థాయి పరిశీలన

'జగనన్నకు చెబుదాం'లో ఫిర్యాదుపై స్పందించిన అధికారులు

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ ఫార్మా సిటీ పరిశ్రమల కాలుష్యం, బొగ్గు లారీల కాలుష్యం, బొగ్గుధూళి కణాలు, ఫ్లయాస్ వ్యర్థాలు, జల కాలుష్యం, భూగర్భ జలాల కాలుష్యం వంటి వాటి తీవ్రతపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మంగళవారం క్షేత్ర స్థాయి పరిశీలన చేసినట్లు వైసిపి మండల మాజీ అధ్యక్షులు బోద్దపు చిన్నారావు బుధవారం తెలిపారు. ఈ కాలుష్యం వల్ల మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గత నెల 15న అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవిపటాన్ శెట్టి ఆధ్వర్యంలో స్థానిక వెన్నెలపాలెం ఎన్‌టిపిసి కళ్యాణ మండపంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు చిన్నారావు చెప్పారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 12న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు శ్యామ్ వర్దన్ ఆధ్వర్యంలో కాలుష్య ప్రభావిత గ్రామాల్లో తనను వెంటపెట్టుకొని క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్లు వెల్లడించారు. అధిక సామర్థ్యంతో తిరుగుతున్న భారీ వాహనాలను, వాటి కారణంగా దెబ్బతిన్న ఆర్ అండ్ బి రహదారులను, రోడ్లకు ఇరువైపులా వెదజల్లుతున్న బొగ్గు, ఫ్లయాస్ వ్యర్థాలను ప్రత్యక్షంగా చూశారని చెప్పారు. నివాస గృహాలు, రోడ్లకిరువైపుల ఉన్న చెట్లు, పంట పొలాలపై వెదజల్లుతున్న బొగ్గు, ఫ్లయాస్ వ్యర్థాల కాలుష్యం గుర్తించారని, ఈ కాలుష్యానికి కారణమవుతున్న నాలుగు ట్రాన్స్‌పోర్టు కంపెనీలను గుర్తించారని వెల్లడించారు. వెంటనే రవాణా శాఖ, పిసిబి విభాగాల నుంచి నోటీసులు జారీ చేసి కాలుష్య సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చారని చిన్నారావు తెలిపారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీష్

వైసిపికి ఓటమి తప్పదు

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు కొత్త ఇన్‌ఛార్జులను నియమించినా రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి తప్పదని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు జోస్యం చెప్పారు. స్థానిక టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక మతిభ్రమించిన జగన్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని అందుకే కొత్త నాటకం ఆడుతూ అభ్యర్థులను మార్పుతున్నారని ఎద్దేవా చేశారు. మంగళవారం ప్రకటించిన 11 మంది ఇంచార్జుల్లో ఒక్కరూ కూడా గెలిచే పరిస్థితి లేదన్నారు. ప్రజలు పడుతున్న బాధలకు ప్రతీకారంగా రానున్న ఎన్నికల్లో జగన్ రెడ్డికి బై బై చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు వైసీపీ నాయకులు ఆంధ్ర ప్రదేశ్ ప్రజలను దోచుకోవడం జరిగిందన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కేకేవిఎ నారాయణరావు, ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, పట్టణ ఉపాధ్యక్షులు బోడి వెంకటరావు, టిఎన్‌టియుసి నాయకులు సాలాపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సిల వర్గీకరణపై జగన్ మౌనం వీడాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా సుంకర మెట్టలోగల ఎస్‌కే 99 హోటల్‌లో బుధవారం జరిగిన ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం వైసిపి ఎంపీలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా జగన్మోహన్ రెడ్డి కడపలో జరిగిన వైసిపి ప్లీనరీ సమావేశంలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేశారని, తను కడప ఎంపీగా ఉన్నప్పుడు నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు వర్గీకరణకు అనుకూలంగా లేఖ రాశారని గుర్తు చేశారు. ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు వర్గీకరణ విషయంలో మౌనం వీడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు మంగరాజు, కొల్లి చిన్న అప్పారావు, యలక మల్లి బాబు మాదిగ, గంపల చినరాజు మాదిగ, కాకినాడ కనకేశ్వర్ రావు మాదిగ, చేవ్వేటి అప్పారావు మాదిగ, చేవ్వేటి సోమరాజు, ఏడిద సురేశ్, చేవ్వేటి కమల చంటి, రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో నైపుణ్యాలను గమనించి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని స్థానిక జడ్‌పిటిసి సభ్యురాలు ఈర్లే అనురాధ అన్నారు. బుధవారం స్థానిక భవిత సెంటర్లో వివిధ పోటీల్లో పాల్గొన్న వికలాంగ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి మాట్లాడుతూ వికలాంగ పిల్లలకు ప్రభుత్వం ఎన్నో పథకాలను, రిజర్వేషన్లను అమలు చేస్తుందన్నారు. ఇద్దరూ సిడబ్ల్యుఎస్ పిల్లలకు ట్రై సైకిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వివి ప్రసాద్, ఎంఈఓ 1, 2 సత్యనారాయణ డివిడి ప్రసాద్, భవిత రిసోర్స్ పర్సన్స్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అందరికీ సంక్షేమ పథకాలు



వైసిపి జెండాను ఆవిష్కరిస్తున్న దిలీప్‌కుమార్, సూరిబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో వైఎస్.జగన్ ప్రభుత్వంలో అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఇన్లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు, మండల వైఎస్సార్సీపీ పార్టీ అధ్యక్షులు పెద్ది శెట్టి గోవింద అన్నారు. అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామ సచివాలయం దగ్గర వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముందుగా మా నమ్మకం నువ్వే జగనన్న బోర్డు ఏర్పాటు చేసి గ్రామంలో జరిగిన సంక్షేమ పథకాల ద్వారా ఏ పథకానికి ఎంత ఖర్చు పెట్టారో వివరించారు. గుడివాడ గురునాథరావు జంక్షన్ వద్ద దగ్గర వైఎస్ఆర్సీపి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి అప్పారావు, వైస్ ఎంపీపీ అయితా ఆనంద రాము, వైసిపి నాయకులు మొల్లి నాయుడు, యన్నంశెట్టి శ్రీనివాసరావు, కర్రి బుజ్జి, యాదగిరి రామచంద్ర రావు, రొంగలి శ్రీను, బోయిన శ్రీను, బోయిన రమణ, కొట్నాల పద్మ కుమారి, మరిపల్లి శోభా, పంచడి పద్మ, ఎన్ఎస్ లక్ష్మి, పిటిపిఆర్డి కే ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

80వ వార్డులో...

అనకాపల్లి పట్టణం 80 వార్డు పరిధిలోని 21వ సచివాలయం వద్ద బుధవారం కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ఆధ్వర్యంలో ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వైసిపి అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. లబ్దిదారుల జాబితాలతో కూడిన మా నమ్మకం నువ్వే జగనన్న లబ్దిదారుల బోర్డ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సాధికార యాత్ర విజయవంతంపై ఎమ్మెల్యే ధన్యవాదాలు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో మంగళవారం జరిగిన బీసీ సాధికార యాత్ర విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు ధర్మశ్రీ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సాధికార యాత్రకు నియోజకవర్గ నాలుగు మండలాల నుండి సుమారు 50000 మంది హాజరయ్యారని, సభా ప్రాంగణం చాలకపోవడంతో ఎక్కువమంది రోడ్డుపైనే ఉండిపోయారని తెలిపారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్నా ప్రభుత్వంపై ఉన్న అభిమానంతో వచ్చిన వారిలో ఎక్కువ శాతం మంది మహిళలు ఉండటం తమకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలు ప్రజాప్రతినిధులు నాయకులు పార్టీ క్యాడర్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చోడవరం ఎంపీపీ గాడి కాసు, మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, డీసీఎంఎస్ చైర్మన్ పల నరసింగరావు, పార్టీ సీనియర్ నాయకులు బుద్దేటి సూర్యనారాయణ, ఓరుగంటి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి తదితరులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులకు అవసరమయ్యే క్రీడా సామాగ్రిని బుధవారం వ్యాయామ ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. గ్రామాల నుండి ఎంతో ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొన్న యువతీ యువకులను పారదర్శకంగా ఎంపిక చేయాలని వ్యాయామ ఉపాధ్యాయులను ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ కోరారు. మండలానికి వచ్చిన క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, టెన్నికాయిట్ కిట్లును స్థానిక జడ్పిటిసి సభ్యురాలు అనురాధ, మండల ప్రత్యేక అధికారి ఈ నాగలక్ష్మి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీవో వివి ప్రసాద్, ఎంఈఓ 1, 2 సత్యనారాయణ, డివిడి ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు త్రినాధరాజు, దేవుళ్ళు, కృష్ణ, జగన్, లక్ష్మీ, రోహిణి, ఉమామహేశ్వరి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



వరలక్ష్మి, విజయలకు ప్రశంసా పత్రాలు ఇస్తున్న దృశ్యం

ఆట బొమ్మల తయారీలో వరలక్ష్మికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి-దేవరాపల్లి

కేంద్ర మానవవనరుల శాఖ ఆధ్వర్యంలో భీమిలి ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో జరిగిన జిల్లాస్థాయి సంప్రదాయక ఆట బొమ్మల తయారీ పోటీల్లో కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి బాలిబాయిన వరలక్ష్మి ప్రథమ స్థానం సాధించింది. దీంతో ఈ నెల 14, 15 తేదీలలో అమరావతిలో జరిగే రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ పోటీలకు ఎంపికైంది. కళా ఉత్సవ పోటీలలో బాగంగా జానపద పాటల పోటీలలో 9వ తరగతి చదువుతున్న కొరువాడ విజయ తృతీయ సాధించింది. వీరిని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుని పీబిటి సుందరి, మండల విద్యా శాఖాధికారులు బి.పడాల దాసు, ఉషారాణి, కొటాన రాంబాబు మాస్టారు, గ్రామ సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, తల్లి దండ్రుల కమిటీ చైర్మన్ దాసరి సూర్య నారాయణ, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రమాదంలో కోల్పోయిన చెయ్యి చూపుతున్న అప్పలనాయుడు

ప్రభుత్వ సాయం కోసం వికలాంగుడు వేడుకోలు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

సిఎం సహాయ నిధి నుండి తనను ఆదుకోవాలని మండలంలోని రాజాంకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు యన్నంశెట్టి అప్పలనాయుడు ఎమ్మెల్యే ధర్మశ్రీకి విన్నవించారు. గత నెల 9న ఎలమంచిలిలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు తన చేయి విరిగిందన్నారు. కేజీహెచ్లో వైద్యం చేశాక వైద్యులు ఎడమ చెయ్యి సగ భాగాన్ని తొలగించినట్లు చెప్పారు. మూడేళ్ల కిందట తన కుమారుడుకి కూడా ప్రమాదంలో ఎడమ చెయ్యికి అంగవైకల్యం ఏర్పడిందన్నారు. తనపై ఆధారపడి తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, చేయి తొలగించడంతో పనిచేయలేని స్థితిలో ఉన్న తనను ప్రభుత్వమే ఆదుకోవాలని అప్పలనాయుడు ఎమ్మెల్యే ధర్మశ్రీని వేడుకున్నాడు.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న ఎంపిపి

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని పిసినకాడ గ్రామపంచాయతీ పరిధి బిఆర్టి కాలనీలో ఉన్న గౌరీ పరమేశ్వరుల వారిని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను దుస్సాలువతో సన్మానించారు. దీనికి ముందు కాలనీలోని ప్రధాన కాలువ పనులను ఎంపిపి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మొల్లేటి హైమా శివాజీ, సత్తిబాబు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎంపిపి గొర్లి సూరిబాబు



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

త్వరితగతిన పంట నష్టం నమోదు

ప్రజాశక్తి-సబ్బవరం : మిచౌంగ్ తుఫాను కారణంగా వరి పంట నష్టపోయిన రైతులు వివరాలను సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన క్షేత్ర స్థాయిలో నమోదు చేసి నివేదికను అందించాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని అవకాపల్లి అగ్రకల్చర్ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు సూచించారు. మండలంలోని అమృతపురం, పెదనాయుడుపాలెం గ్రామాలలో బుధవారం దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ తుఫాను కారణంగా నీట మునిగిన, పడిపోయిన వరి పైరుకు 33శాతం పైబడి నష్టం వాటిల్లితే ఆ వివరాలు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, ఎఇ బాలరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.జానీ, పి భావన, మండల వ్యవసాయ సలహా కమిట డైరెక్టర్ సబ్బవరపు సత్యనారాయణ, అమతపురం సర్పంచ్ బైలిపూడి రామారావు పాల్గొన్నారు.

కొసిరెడ్డికి పంచకర్ల రమేష్ బాబు నివాళి

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని ఈ బోనంగి పంచాయతీ ఫార్మా సిటీ కాలనిలోని జనసేన పార్టీ నాయకులు బుగిడి రామ గోవిందరావు బావ కొసిరెడ్డి అప్పారావు పెద్దకర్మ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. దీనికి జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు హాజరై కొసిరెడ్డి అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు దుల్ల రాము నాయుడు, ఇందల రమణ, గొన్న రమాదేవి, కరణం నర్సింగరావు, గొంతిన రాము, అర్జిల్లి అప్పలరాజు, పరవాడ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని చినకోరాడ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి బిటి.దొర డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన గ్రామంలో పర్యటించారు. అనంతరం దొర మాట్లాడుతూ, వారం రోజుల క్రితం గ్రామంలోని తాగునీటి పథకం మరమ్మతులకు గురై గ్రామంలోని తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కిలోమీటర్ దూరంలో ఉన్న బోరు దగ్గర నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే గిరిజన గ్రామానికి తాగునీటి సమస్యను పరిష్కరించుకుంటే గిరిజన ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : మిచౌంగ్ తుపాన్‌లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ బిజెపి ఆధ్వర్యంలో బుధవారం ఆర్డిఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపరెడ్డి పరమేశ్వరావు మాట్లాడుతూ కౌలు రైతులను ఆదుకోవడంతో పాటు రెండు రోజుల్లో రైతుల వద్ద తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

రాంకీ యాజమాన్యంపై చర్యలకు వినతి

ప్రజాశక్తి - పరవాడ : మండల కేంద్రంలోని పరవాడ పెద్ద చెరువులోకి రాంకీ సంస్థ విడుదల చేసిన వ్యర్థ రసాయనాల కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం రైతులు ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావుకు, జెడ్పీటీసీ పిఎస్.రాజుకు, డిప్యూటీ తహశీల్దార్ శాంతి భూషణ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం చేయాలని కోరారు.



ఎంపిపికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఆశా వర్కర్ల 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-చోడవరం

ఆశా కార్యకర్తల సమస్యలపై ఈనెల 14, 15వ తేదీల్లో అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద జరుగు 36 గంటల ధర్నాను విజయవంతం చేయాలని ఆశ కార్యకర్తలు యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం చోడవరంలో ఆశ కార్యకర్తల యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాన్ని విడుదల చేశారు. ఆశా కార్యకర్తలతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం తమకు తగిన వేతనాలు ఇవ్వడం లేదని, ఏవిధమైన సదుపాయాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బొద్దాన రామలక్ష్మి, కొరచా వరలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశా కార్యకర్తలు

గ్రామ వనరులపై అవగాహన కలిగి ఉండాలి



గ్రామ పటం వేసి వనరుల గురించి వివరిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

ప్రజాశక్తి -వడ్డాది : ప్రతి ఒక్కరికీ గ్రామ వనరులపైనా, గ్రామ పటం, పరిసరాలపైనా అవగాహన కలిగి ఉండాలని శ్రీకాకుళం కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు సూచించారు. బుచ్చయ్య పేట మండలం బంగారు మెట్ట గ్రామంలో బుధవారం విద్యార్థులు వ్యవసాయ పనిపై రైతులకు అవగాహన కలిగించే కార్యక్రమాన్ని చేపట్టారు రైతులకు అర్థమయ్యేలా మ్యాపు వేసి సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వరి, చెరుకు, ఇతర వాణిజ్య పంటలు ఎప్పుడెప్పుడు వేయాలో, ఆధునిక పద్దతులతో ఎలా పండించాలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు కే దుర్గా, శ్రావణి, ఏ మనీషా, పి.లాస్య, ప్రియ టి.కావ్య, పి కీర్తన కే.అనూష, సాయం శ్రీరామ్మూర్తి, దొండ వెంకట రమణ, దవరసింగ్ వెంకట రమణ, శీలం నగేష్. పాల్గొన్నారు.

వరహా లక్ష్మీనరసింహస్వామికి రత్నాకర్ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి పట్టణం గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోట వద్ద వెలసిన శ్రీవరహానరసింహస్వామి వారిని వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ రెండురోజుల పాటు వరహా నరసింహస్వామివారికి వెండి కవచం, శ్రీలక్ష్మి అండాల్ అమ్మవారికి వెండి చీర అలంకరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమంలో దాడి రత్నాకర్ పాల్గొన్నారు. అనంతరం రత్నాకర్‌ను ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమా, వార్డు వైసీపీ ఇన్‌ఛార్జి కొణతాల భాస్కరరావు, మాజీ కౌన్సిలర్ పెతకంశెట్టి జగన్మోహనరావు, బొడ్డపాటి చినరాజారావు, కటారి దేముడు, రేబాక ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న వైసిపి నేత దాడి రత్నాకర్

ఉమారామలింగేశ్వర ఆలయం వద్ద అన్నసమారాధన

స్థానిక శారదానది ఒడ్డున వెలసిన శ్రీఉమారామలింగేశ్వరస్వామి వారి ఆలయం వద్ద కార్తీకమాసం ముగింపు పోలిస్వర్గం సందర్భంగా భక్తులకు ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు అడ్డబోయిన నారాయణరావు, జామి రామయ్య, పలకా చంటి, జెట్టి సూరిబాబు, కర్రి జగ్గఅప్పారావు, పలకా కాసులు, బొడ్డపాటి చినరాజారావు, యల్లపు శ్రీను, ఇంటి త్రినాధ్, కటారి దేముబు, రేబాక ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఈ-చలానాలు రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆటో మోటార్ కార్మికులపై మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ఈ-చలనాలను రద్దు చేసి కార్మికుల్ని ఆదుకోవాలని బుధవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఏఐటియుసి అనకాపల్లి జిల్లా కన్వీనర్ వైయన్.భద్రం మాట్లాడుతూ ప్రమాదాలు జరుగుతున్నాయని సాకు చూపి ఆటో మోటార్ కార్మికులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 21, 31 జీఓలను తీసుకొచ్చి గతంలో 100 రూపాయలు ఉన్న జరిమానాలు వేలల్లోనూ, వేలల్లో ఉన్న జరిమానాలు రూ.10000 రూ.20,000 వరకు పెంచి ఆటో కార్మికులను దోపిడీ చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో పెద్దింటి నాగేశ్వరరావు, మోహన్, పాల్గొన్నారు.

పంట నష్టం నమోదు పారదర్శకంగా ఉండాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : తుఫానులో నష్టపోయిన వరి పంట నమోదు పారదర్శకంగా ఉండాలని తాసిల్దార్ రమేష్ బాబు ఆదేశించారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో బుధవారం గ్రామ గణన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం విధించిన గడువులోగా ప్రభుత్వం ప్రకటించిన నిబంధన ప్రకారము పంట నష్టము నమోదు చేయాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు తావు లేకుండా పంట నష్టము సక్రమంగా అంచనా వేయాలని గణన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జి నాగలక్ష్మి. గ్రామ పంట నష్ట గణన అధికారులు, మండల గణన అధికారులు పాల్గొన్నారు.

15న పిఎసిఎస్ శత వార్షికోత్సవం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం శతవసంత వార్షికోత్సవ వేడుకలు ఈనెల 15వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేసినట్లు సంఘ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్‌రావు తెలిపారు. స్థానిక సహకార సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ సహకార సంఘ వేడుకలు కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తామని, కార్యక్రమంలో రైతులు, రైతు సంఘాల నేతలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, ఆడారి గణేష్, కొయ్యి వెంకట్రావు పాల్గొన్నారు.



ఎంవిఆర్‌ను సత్కరిస్తున్న మహిళలు

ఎంవిఆర్ ఉచిత తీర్థ యాత్ర

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : ఎంవిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నిత్య తీర్థ యాత్రల్లో భాగంగా కార్తీక మాసం చివరి రోజ బుధవారం మండలంలోని చూచుకొండ గ్రామానికి చెందిన భక్తులతో ట్రస్ట్ బస్సులు బయలుదేరాయి. ప్రముఖ పుణ్య క్షేత్రాలైన సింహాచలం, అన్నవరం, కనకమహాలక్ష్మి ఆలయాల దర్శనాలకు తీసుకెళ్లారు. భక్తులకు ఉదయం ఆల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రికి ఆల్పారం, తాగునీరు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా ఎంవిఆర్‌ను మహిళలు సత్కరించారు. కార్యక్రమంలో ఎం.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, సంజు యువసేన సభ్యులు, సీనియర్ జర్నలిస్టు పెంటకోట సత్యనారాయణ, ముత్తుర్తి నాగ శంకర్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బీమా నగదు అందజేత

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దేవరాపల్లి కుమ్మరవీధికి చెందిన వాలేటి పాపారావు కుటుంబానికి వైఎస్ఆర్ బీమా కింద మంజూరైన తక్షణ సాయం రూ.10వేలు నగదును వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు బుధవారం మృతుని కుమారుడు వాలేటి సురేష్ అందజేశారు. బీమా పథకం కింద లక్ష రూపాయలు మంజూరు కాగా, తక్షణ సాయం రూ.10 వేలు అందజేశామని, మిగిలిన రూ.90వేలు అకౌంట్‌లో జమ కానున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శెట్టిబలిజ రాష్ట్ర డైరెక్టర్ సిమ్మ అప్పన్న, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసరావు, వీఆర్వో నాగేశ్వరరావు, కోటి, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- వడ్డాది : సినీ నటుడు విక్టరీ వెంకటేష్ జన్మదిన వేడుకలు బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. టౌన్ వెంకటేష్ అభిమాన సంఘం అధ్యక్షుడు బైన గిరిబాబు ఆధ్వర్యంలో వడ్డాది మెయిన్ యుపి స్కూల్లో చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. వెంకటేష్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వెంకటేష్ అభిమాన సంఘం ముద్రించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. స్థానిక హాస్పిటల్లో రోగులకు రొట్టెలు పండ్లు పంపిణీ చేశారు.

విద్యుత్ సమస్యలపై సిఎమ్‌డికి వినతి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై ఏపీఈపీడీసీఎల్ సిఎమ్‌డి పృధ్వీతేజకు వివరించడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే కనడం ధర్మశ్రీ తెలిపారు. చోడవరం మండలంలో విద్యుత్తు సరఫరాకు 25 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని, తక్షణమే చోడవరం పట్టణ అవసరాలు తీర్చడం కోసం నరసయ్యపేట వద్ద వద్ద నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు రెండు రోజుల్లో పనులు ప్రారంభం జరుగుతాయని చెప్పారు. రావికమతం, బుచ్చయ్యపేట, రోలుగుంట మండలాల్లో విద్యుత్తు సమస్యలపై వివరించడం జరిగిందన్నారు ఇటీవల తుఫాన్ కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను యుద్ధ ప్రాతిపదిపై పనులు చేయడానికి సిఎండి ఆదేశించారని ఆయన తెలిపారు.

17న సాంబశివరావు 8వ వర్ధంతి

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : కీర్తిశేషులు సాంబశివరావు మాస్టారు 8వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక నందీశ్వర కళా ప్రాంగణం వద్ద నందీశ్వర నాట్యమండలి, మాస్టారు శిష్యుల ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన రాత్రి ఏడు గంటలకు సంస్మరణ సభ ఏర్పాటు చేసినట్లు గ్రామీణ యువజన మందిర సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము తెలిపారు. ఈ మేరకు స్థానిక తులసి కళావేదిక వద్ద బుధవారం కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆడారి గణపతి అచ్చం నాయుడు, మల్ల కృష్ణ, ఆడారి మహేష్, కాశి బాబు, మల్ల రామ జగన్నాథం, ఆడారి సోమశేఖర్, కాండ్రేగుల సన్యాసిరావు, ఆడారి రమణబాబు పాల్గొన్నారు.

ఘనంగా పోలిపాడ్యమి వేడుకలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : కార్తీక మాసం ముగింపు సందర్భంగా బుచ్చియ్యపేట మండలంలోని పలు ఆలయాలలో పోలి స్వర్గం వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున నదులు, చెరువులు, కాలువలలో అరటి దొప్పలపై దీపాలు వెలిగించి వదిలారు. వడ్డాది పెద్దేరునదీ తీరంలో భక్తులు దీపారాధనలు చేశారు.

మునగపాక రూరల్ : స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలోని కృష్ణంరాజు నదిలో మహిళలు అరటి డొప్పలలో దీపాలను వెలిగించి నదీ ప్రవాహంలో విడిచిపెట్టారు.

రైతులు కష్టాల్లో ఉంటే బస్‌యాత్రలా..?

ప్రజాశక్తి-రోలుగుంట : మిచౌంగ్ తుపాన్ దెబ్బకు పంటలను నష్టపోయి, బాధిత రైతాంగం అల్లాడుతుంటే, వారిని పరామర్శించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎంత నష్టం జరిగిందో అంచనా వేసి పరిహారం ఇచ్చి ఆదుకోవాల్సిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు సామాజిక సాధికార బస్సులు యాత్రల్లో మునిగి తేలడం సిగ్గుచేటని రోలుగుంట ఎంపిటిసి సుర్ల రామకృష్ణ మండిపడ్డారు. బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, . తుపాన్ దెబ్బకు మండలంలో వరిసాగుచేసిన 3300 ఎకరాల్లో దాదాపు 2వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. పంటనష్టాలను అంచనా వేయడంలో అధికారులు తాత్సారం చేస్తున్న నేపథ్యంలో వారిని అదిలించి, బాధిత రైతులను ఆదుకోవాల్సిన అధికార పక్షం బస్సుల్లో యాత్రల పేరిట షికార్లు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. అధికారులను కూడా ఏవేవో కార్యక్రమాల పేరు చెప్పి తమ వెంట తిప్పుకుంటున్నారని మండిపడ్డారు.ఇప్పటికైనా కళ్లు తెరిచి, కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని కోరారు.

వేగవంతంగా ఇంటి పన్ను వసూలు


పంచాయతీ కార్యదర్శుల తో మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి

ప్రజాశక్తి-నక్కపల్లి: ఇంటి పన్నులు వసూళ్ల వేగవంతం చేయాలని ఇఒపిఆర్‌డి బి సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థికసంవత్సరం ఇంటిపన్నుతోపాటు బకాయిలను శతశాతం వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీలు సమావేశం శుభ్రం చేయించాలని, బ్లీచింగ్ చల్లాలన్నారు. వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం- ఆంధ్రను విజయవంతం చేయాలన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మున్సిపాలిటీలోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి కొత్తవీధి మీదుగా చోడవరం మెయిన్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులను నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అభీష్టం మేరకు రూ.6 కోట్లతో 30 అడుగల మేర రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. పనులు పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు తీరుతాయన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, తమరాన శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

పటిష్టంగా అట్రాసిటీ చట్టం అమలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : అట్రాసిటీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు కోరారు.. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో అట్రాసిటీ చట్టం సక్రమంగా అమలు చేయకపోవడం వల్లే దళితులు, మహిళలపై దాడులు అధికమయ్యాయన్నారు. నేరం జరిగిన 24 గంటల్లో దోషులను అరెస్టు చేసేలా చట్టం అమలు కావాలని డిమాండ్ చేశారు. దళితులకు అండగా ఉంటామని అన్ని పార్టీలు, ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా ఆచరణలో చిత్తశుద్ధి కనబరచడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

మంచు సోయగం..

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల వ్యాప్తంగా బుధవారం మంచు కురియడంతో ప్రకృతి ప్రేమికులు తన్మయులై ఆనందం వ్యక్తం చేశారు. మైదాన ప్రాంతంలో దట్టంగా కురిసిన మంచు కారణంగా పలువురు ఇబ్బంది పడ్డారు. తీవ్రమైన పొగ మంచు కొరియడంతో వాహనదారులతోపాటు వాకర్స్ పాడి రైతులుఅవస్థలు పాలయ్యారు. ఉదయం 8 గంటల వరకు రోడ్డు, పరిసరాలు కానరానంతగా పొగమంచు కురిసింది.


దట్టంగా కురుస్తున్న పొగమంచు

18 వరకు పంట నష్టాల నమోదు


మాడుగులలో పంట నష్టాలు పరిశీలిస్తున్న కమిటీ

ప్రజాశక్తి -మాడుగుల : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మిచౌంగ్ తుపాన్ దెబ్బకు జరిగిన పంటనష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి లెక్కిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎం వాసుదేవరావు తెలిపారు. విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శి, రైతుభరోసా కేంద్రం సిబ్బందితో కూడిన కమిటీ గ్రామాలలో పంట నష్టాల లెక్కింపు చేపడుతోంది. బుధవారం వండర్‌పాలెం, జాలంపల్లి, లావకొండ గ్రామాలలో పంట నష్టాలు లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించినట్లు ఎఒ తెలిపారు. కమిటీ సభ్యులు అడిగిన పూర్తి వివరాలను రైతు సమర్పించాలని ఎఒ కోరారు. కార్యక్రమంలో పండరిపాలెం సర్పంచ్ అల్లాడ నాగేశ్వరరావు, విఆర్ఒలు అప్పారావు, వివి రమణ, పి లక్ష్మీకుమార్, పంచాయతీ కార్యదర్శుల ఆర్ కవిత, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెం : ఈ నెల 18 వరకు పంట నష్టాలను నమోదు చేస్తామని మాకవరపాలెం మండల వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, విఆర్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా కేంద్రం ఇన్‌ఛార్జి, విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శి కమిటీగా పంట నష్టం నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ విధివిధానాలను వివరించారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సీతామహాలక్ష్మీ పాల్గొన్నారు.

నక్కపల్లి : ప్రభుత్వ మార్గదర్శకాలు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంటనష్టం అంచనా వేసి 18లోగా అర్హత గల రైతులు జాబితా నివేదించాలని వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామస్థాయి కమిటీలు, విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశంలో మాట్లాడుతూ, మిచౌంగ్ తుపాన్‌కు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టం అంచనా వేయాలన్నారు..తుఫాన్ ప్రభావానికి 33 శాతం పైన పంట నష్టం వాటిల్లినట్లయితే వరికి హెక్టారుకు రూ.17వేలు పంట నష్టపరిహారం బాధిత రైతుకు వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో డిటి నీరజ, ఇఒపిఆర్‌డి బి సత్యనారాయణ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి మంచి స్పందన

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ అధ్వర్యంలో స్థానిక అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణిదేవి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించగా, 100 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ నీలవేణిదేవి మాట్లాడుతూ, విద్యార్థి, నిరుద్యోగ సమస్యలపై పోరాడే విద్యార్థి,యువజన, సంఘాలకు రక్తదాన శిబిరం నిర్వహించి, రక్తదానం చేయాలన్న సామాజికస్పృహ రావడం అభినందనీయమన్నారు. ఎందరి ప్రాణాలకో ఆదరువుగా రక్తదానశిబిరం నిర్వహించిన డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ఎన్. రమణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గీతాకృష్ణ, ఎమ్. రమణ, ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ అపర్ణ, సిబ్బంది వెంకటేష్, ప్రసాద్ జిల్లా కమిటీ సభ్యులు ఆర్ మణికంఠస్వామి పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న దాతలు

'ఆడుదాం ఆంధ్ర' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. బుధవారం నర్సీపట్నం తురకబడిలో ఆడుదాం ఆంధ్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి .జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. ఈ నెల 15 నుంచి బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను, అయ్యరక కార్పోరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు నర్సీపట్నం కరాటే క్రీడాకారులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ఈ నెల 16, 17 తేదీల్లో వారణాసిలో జరగనున్న 8వ అఖిల భారత ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలకు నర్సీపట్నం ఆర్‌పి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నుండి ఆరుగురు క్రీడాకారులు ఎ.హేమంత్, ఎ.మనోజ్, జి.లిఖిత్‌రామ్, వై.అనన్య, బి.ప్రశాంతి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కోచ్ చిన్నా మాట్లాడుతూ గాటాస్, కుమాటి(ఫైట్) విభాగంలో తమ అకాడమీ విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఆర్‌పి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు మాట్లాడుతూ ఇది చాలా వ్యయంతో కూడుకుందని, ప్రభుత్వం తరపున గానీ, దాతల తరపున గానీ స్పాన్సరింగ్ చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. వారణాసికి బయలుదేరి వెళుతున్న వీరంతా మంచి మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుతాపల్లి శ్రీజ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


జాతీయ పోటీలకు ఎంపికైన కరాటే క్రీడాకారులు

కొనసాగిన తపాలా ఉద్యోగుల సమ్మె


నిరసన తెలియజేస్తున్న తపాలా ఉద్యోగులు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఏఎల్ పురం పోస్టల్ కార్యాలయం వద్ద తపాలా ఉద్యోగులు బుధవారం రెండో రోజు కూడా నిరవధిక సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపాలాశాఖ ఉన్నతాధికారులు చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని, తమ న్యాయమైన డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని కోరారు. 8 గంటల పని విధానం అమలు చేయాలని, అదనపు సర్వీస్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు.కార్యక్రమంలో యూనియన్ నాయకులు పసగడుగుల ప్రసాద్, పి.కృష్ణ, గజరాజు, షణ్ముక్, చిన్నబ్బాయి, ప్రకాష్ పాల్గొన్నారు.

బైరెడ్డిని కలిసిన వైసిపి యూత్


బైరెడ్డిని సత్కరిస్తున్న భార్గవ్, సురేష్‌వర్మ, ఇతర యూత్ నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి: అమరావతిలో జరిగిన వైసిపి యువజన విభాగ సమావేశంలో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థను బుధవారం కలిసినట్లు స్థానిక యువజన విభాగం నేతలు తళ్ళ భార్గవ్, సురేష్ వర్మ తెలిపారు. వైసిపి యువజన అనుబంధ విభాగాల చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆధ్వర్యంలో యువజన విభాగం సమావేశం జరిగిందన్నారు. సమావేశంలో బైరెడ్డి సిద్ధార్థను సన్మానించినట్లు తెలిపారు

నిద్రలోనే కాలేజీ వాచ్ ఉమెన్ మృతి

ప్రజాశక్తి -కొత్తకోట : కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళా వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎద్దు చిలకమ్మ హఠాన్మరణం పొందింది. మంగళవారం రాత్రి బంధువుల ఇంట్లో పెళ్లికి సంబంధించిన వంటకాల పనుల్లో పాల్గొన్న చిలకమ్మ, అలసటగా ఉందని తెల్లవారుజామున నిద్రకు ఉపక్రమించింది. బుధవారం తెల్లవారుజామున ఎంతకీ లేకపోవడంతో భర్త చూడగా, అప్పటికే ఆమె నిద్రలో మృతి చెందింది. మూడేళ్లుగా స్థానిక కళాశాలలో వాచ్‌మెన్‌గా చిలకమ్మ పనిచేస్తోంది. ఆమె మృతికి కళాశాల ప్రిన్సిపాల్ ఎవిఎస్ ప్రభాకర్, ఇతర సిబ్బంది సంతాపం తెలిపారు. దహనసంస్కారాల ఆర్థికసాయం అందజేశారు.

14 నుంచి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

ప్రజాశక్తి - నక్కపల్లి : నక్కపల్లిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -19 బాల బాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్లు అనకాపల్లి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ రాంబాబు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు జట్లుగా హాజరవుతారన్నారు .నక్కపల్లి హాకీ క్రీడా మైదానంలో ం పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని బలిరెడ్డి హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, కార్యదర్శి కె.తాతాజీ తెలిపారు.

కవగుంటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - రావికమతం : పంచాయతీలో పారిశుధ్య పరిక్షణకు చర్యలు చేపడుతున్నట్లు మండలంలో కవగుంట పంచాయతీ సర్పంచ్ దాసరి సూర్యకుమారి, సచివాలయ కన్వీనర్ వరహాలు తెలిపారు.ఇందులో బాగంగా ఎస్‌సి కాలనీలో మంచినీటిబోరు, రచ్చబండ చుట్టూ పేరుకుపోయిన పిచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు బి పద్మ, వాలంటీరు పి నాయుడు బాబు, పి.రమణ పాల్గొన్నారు

యువగళం పాదయాత్రలో మేము సైతం..



యువగళం పాదయాత్రలో లోకేష్‌తో అనిత, ఇతర నేతలు

ప్రజాశక్తి- యస్ రాయవరం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వెంట యువగళం పాదయాత్రలో తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, పార్టీపోలిట్‌బ్యూరో సభ్యురాలు మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, రాష్ట్ర పంచాయతీ ఛాంబర్ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపిపి మేజర్ల వినోద్ రాజు, మండల పార్టీ మాజీ అధ్యక్షులు, గుడివాడ మాజీ సర్పంచ్ నల్లపరాజు వెంకటపతిరాజు ఉన్నారు.

యువగళానికి తరలిన టిడిపి నేతలు



యువగళం పాదయాత్రకు వెళుతున్న బూరుగుపాలెం నేతలు

ప్రజాశక్తి -మాకవరపాలెం : యలమంచిలి నియోజకవర్గంలో జరుగుతున్న నారా లోకేష్ యువగళం పాదయాత్రలో పాల్గొనడానికి మండలం నుంచి టిడిపి నాయకులు తరలివెళ్లారు. బూరుగుపాలెం గ్రామం నుండి మండల ఉపాధ్యక్షులు కేతిరెడ్డి చిరంజీవి ఆధ్వర్యంలో నాయకులంతా బయలుదేరివెళ్లారు.

ఎన్నికల విధుల పట్ల అప్రమత్తత

ప్రజాశక్తి -నాతవరం : ఎన్నికల విధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ తహశీల్దార్ చయనులు సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ హనుమంతరావు ఆధ్వర్యంలో బూత్ లెవెల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకు సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా విధులు నిర్వహించాలని సూచించారు. బిఎల్‌ఒలు గ్రామాల్లో అందుబాటులో ఉండడాలన్నారు.

ప్రజల ముంగిటకు సంక్షేమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబురావు

ప్రజాశక్తి -నక్కపల్లి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ ఫలాలు ప్రజల ముంగిటకు చేరవేస్తున్నామని ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. బుధవారం మండలంలోని ఉపమాక గ్రామంలో ఏపీకు జగనే సీఎం ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఎగురవేశారు .సచివాలయం వద్ద అభివృద్ధి కార్యక్రమాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహామూర్తి, జెడ్‌పిటిసి కాసులమ్మ, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కొప్పిశెట్టి హరిబాబు, నాయకులు కొల్లాటి బుజ్జి, రమణ, సూర్యనారాయణ, మనబాల తాతారావు, పల్లా చిన్నబ్బాయి, కొర్రా శ్రీను, వియ్యపు శ్రీను పాల్గొన్నారు .

అంగన్వాడీల రెండో రోజు సమ్మె జయప్రదం

తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చేపడుతున్న సమ్మె బుధవారం రెండోరోజున సంపూర్ణ విజయవంతమైంది. వీరికి సిఐటియు, ఐద్వా, ఇతర ప్రజాసంఘాలతోపాటు టిడిపి నేతలు సంఘీభావం తెలిపి సమ్మెలో పాల్గొన్నారు. అవసరమైతే తామూ సమ్మె చేస్తామని భరోసానిచ్చాయి.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)



నర్సీపట్నంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

నర్సీపట్నం టౌన్ : ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్స్ ఆధ్వర్యంలో అంగన్వాడీల నిరవధిక సమ్మె నర్సీపట్నంలో రెండో రోజు విజయవంతంగా కొనసాగింది. ఐద్వా, సిఐటియు నేతలు సంపూర్ణ మద్దతు తెలిపారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు, వారి సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటామని ఐద్వానేతలు భరోసానిచ్చారు. కార్యక్రమలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ప్రాజెక్ట నాయకులు వి.సామ్రాజ్యం, డి.మహాలక్ష్మి, కృష్ణవేణి, ఎఐటియుసి నేత ఆర్.సత్య, పి.వరలక్ష్మి పాల్గొన్నారు.

రావికమతం : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీల రెండవ రోజు సమ్మె యధావిధిగా కొనసాగించారు. యూనియన్ ప్రాజెక్ట అధ్యక్షులు పి వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ సత్యవేణి మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు.

టిడిపి నేతల సంఘీభావం

అంగన్వాడీల సమ్మెకు చోడవరం మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, చోడవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అంగన్వాడీలకు మాటిచ్చి, అధికారంలోకి రాగానే మడం తిప్పి మోసం చేసిందన్నాఉ. 2024ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీలకు న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్‌వి.నాయుడు, సిఐటియు మండల కార్యదర్శి వజ్రపు సత్యవతి, ఎం.కాంతం పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగుల బస్టాండ్ ఆవరణలో సిఐటియు ఆధ్వర్యాన చీడికాడ, మాడుగుల అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె శిబిరంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టిడిపి ముఖ్యనాయకుడు పైలా ప్రసాదరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చింతా సాంబమూర్తి పాల్గొన్నారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి రొంగలి దేవుడు నాయుడు, సిపిఎం మండల అధ్యక్షురాలు కార్లే భవాని, సిపిఎం మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్, అంగన్వాడీల యూనియన్ మాడుగుల, చీడికాడ మండల అధ్యక్షులు బేతా భాగ్యలక్ష్మి, మేడపు రెడ్డి జానకి, టిడిపి ఎస్‌సి,ఎస్‌టి విజిలెన్స్ కమిటీ సభ్యుడు మరువాడ ఈశ్వరరావు, మాడుగుల జనసేన నాయకుడు రొబ్బ మహేష్ పాల్గొన్నారు.

నక్కపల్లి : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీల రెండో రోజు సమ్మెలో .సిఐటియు జిల్లా నాయకులు బ్రహ్మాజీ, రామకృష్ణ పాల్గొని మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.దుర్గారాణి, యూనియన్ నాయకులు బి.సుబ్బలక్ష్మి, రమణమ్మ , సీత, నూకరత్నం, సత్య వేణి, కవిత, లక్ష్మి రాజ్యం, ఉమ్మడి లక్ష్మి పాల్గొన్నారు .

గొలుగొండ : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు రెండో రోజు సమ్మె కొనసాగింది. సిఐటియు జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మంగతాయి, మండల కమిటీ అధ్యక్షురాలు భ్రమరాంబ, రైతు సంఘం జిల్లా నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, నాతవరం, గొలుగొండ మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి నాగశేషు మాట్లాడారు. వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ, పెన్షన్ అమలు జరపాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, సిఐటియు మునగపాక మండల కన్వీనర్ బ్రహ్మాజీ, అచ్యుతాపురం నాయకులు సోమినాయుడు, రాంబిల్లి నాయకులు రామకృష్ణ, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.మాణిక్యం, ఉపాధ్యక్షులు రొంగలి లక్ష్మి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ సంఘం నాయకులు జయలక్ష్మి, రామలక్ష్మి, అంజలి పాల్గొన్నారు.

కె.కోటపాడు : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె రెండోరోజుకు చేరింది. ఇందులో భాగంగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షా శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించి



మాట్లాడుతున్న సిఐటియు నేత ఆర్‌కెఎస్‌వి .కుమార్

జీతాన్ని రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రొంగలి రాము, ఈర్లె నాయుడుబాబు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, అంగన్వాడీల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.కుమారి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోటలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు దగ్గరలో రెండవ రోజు కూడా అంగన్వాడీలు తమ దీక్షలను కొనసాగించారు. దీక్షా శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సందర్శించి మద్దతును తెలియజేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మూడు నెలల్లోగా అంగన్వాడీ సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగ శేషు మాట్లాడుతూ ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయడానికి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, తగినంత బడ్జెట్ కేటాయింపులు చేయడం లేదని తెలిపారు. వీరి ఆందోళనకు ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు శాంతి, భార్గవి, లక్ష్మి, శ్రీదేవి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపి, గొంతెన శ్రీనివాసరావు, వేగి వెంకటరావు, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్బవరం : సబ్బవరం ఐసిడిఎస్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన ఆందోళన కొనసాగింది. ఈసందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్స్, ఆయాలు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మండల కార్యదర్శి సత్యవతి, యూనియన్ నాయకులు వివి రమణమ్మ, దేవి, రామలక్ష్మి, ఎం రమణి, బి, రమణమ్మ, సిహెచ్ దేవి, జి అమ్మాజీ, ఎస్ జగదీశ్వరి, ఆర్ఎస్ లక్ష్మి, డి పుష్పదేవి, ఎం వరలక్ష్మి, సిఐటియు నాయకులు ఎం.గౌరేష్, కోటి పాల్గొన్నారు.

విశాఖపట్నం : మద్రిపాలెంలోని ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఎఐటియుసి అనుబంధ అంగన్‌వాడీ యూనియన్‌ల ఆద్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు తరలివచ్చారు. అంగన్‌వాడీ సంఘం నేత వై.తులసి మాట్లాడారు.

పెందుర్తి : అంగన్‌వాడీలు పెందుర్తి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు సుమారు ఐదేళ్లు గడుస్తున్నా నెరవేర్చలేదన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు మాట్లాడుతూ, పని భారం పెరిగినా సరే వేతనాలు పెంచడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు సిఐటియు కార్యదర్శి బి.జగన్, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.బృందావతి, దేవి భవాని తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ధర్నాను కొనసాగించారు. సిఐటియు జిల్లా నాయకులు మణి మాట్లాడుతూ, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకూ నిరవదిక సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు కె.పద్మావతి, శ్రీదేవి, దుర్గ, లక్ష్మీదుర్గ, శాంతకుమారి, కోమలి, నూర్జహాన్ పాల్గొన్నారు

విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీలకు మద్దతుగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఐఎఫ్‌టియు, పిఒడబ్ల్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.లక్ష్మి, నిర్మల, కొండయ్య పాల్గొన్నారు.

కెవిపిఎస్ మద్దతు

అంగన్‌వాడీల సమ్మెకు కెవిపిఎస్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మద్దెల సుబ్బన్న, తిరుకోటి చిరంజీవి మద్దతు తెలిపారు. బుధవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు.



కె.కోటపాడులో మాట్లాడుతున్న సిఐటియు నేత కోటేశ్వరరావు



నక్కపల్లిలో అంగన్వాడీల నిరసన



గొలుగొండలో సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలు